
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 14 జూన్ 2024



కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు 8లో..

8లో.. మానేరు వాగులో ఆగని ఇసుక దందా

- 11 అంశాలపై క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణ
- ప్రత్యేక యాప్‌లో నమోదు
- జిల్లా వ్యాప్తంగా 1.13 లక్షల ఇళ్లకు నీటి సరఫరా
- 622 ట్యాంకులు... 1263.77 కిలోమీటర్ల పైపు లైన్


కోనరావుపేట మండలం ధర్మారంలో మిషన్‌భగీరథ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మిషన్‌భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ఇంటింటికి అందుతుందా... లోపాలు, ఇబ్బందులు ఉన్నాయా, నల్లాల కనెక్షన్లు లెక్క పక్కాగా ఉందా ఇలా 11 అంశాలపై అధికార యంత్రాంగం ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం మిషన్‌భగీరథ పేరుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే మేరకు తాగునీరు అందించడానికి కోట్ల రూపాయల వ్యయంతో మిషన్‌భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారు. పథకం పూర్తయిన ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలను మిషన్‌భగీరథలో ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ సమగ్ర సర్వే ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిషన్ భగీరథ పథకం పని తీరులోని లోపాలు బయటపడే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటికే పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీళ్లు సక్రమంగా రావడం లేదని, మురికినీరు, ఇతర సమస్యలపై ఆందోళనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ప్రతి జిల్లా పరిషత్ సమావేశంలోనూ మిషన్‌భగీరథ సమస్యలను సభ్యులు ప్రధానంగా లేవనెత్తుతున్నారు. ఈ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి సమస్యలు తెలుసుకోవడమే కాకుండా కేంద్ర జలశక్తి శాఖ నుంచి నిర్వహణ నిధులు మంజూరు కూడా చేసుకోవాలనే భావనతో ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఈ మేరకు జిల్లాలో సర్వే చేస్తున్నారు. దాదాపు పది రోజుల పాటు జరిగే సర్వేలో పంచాయతీ రాజ్ సిబ్బంది, కార్యదర్శులు, ప్రతి ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ ఉందా, పనిచేస్తుందా, ఎంతవరకు నీళ్లు వస్తున్నాయి. ఎన్ని రోజులకు ఒకసారి వస్తున్నాయి.

వివరాలతో పాటు లబ్ధిదారుని పేరు చిరునామా, కుటుంబసభ్యుల వివరాలు సెల్ నంబర్, ఆధార్ సంఖ్య, ఇంటి నంబర్, ఇతర వివరాలు నమోదు చేయడంతో పాటు ఇంటి ఫొటో, నల్లా ఫొటోలను సైతం యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్నారు. లబ్ధిదారుడి సెల్ నంబర్‌కు ఓటీపీ కూడా వస్తుంది. దీనివల్ల పారదర్శకంగా వివరాల సేకరణ జరుగుతుందని చెప్పుకోవచ్చు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సర్వేను కలెక్టర్ అనురాగ్ జయంతి స్వయంగా పరిశీలించారు.


ఇంటెక్‌వెల్

నీటి సరఫరాపై కలెక్టర్ ఆరా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిషన్‌భగీరథ ఇంటింటి సర్వేపై క్షేత్ర స్థాయిలో కలెక్టర్ అనురాగ్ జయంతి అరా తీశారు. గురువారం కోనరావుపేట మండలం ధర్మారంలో సిబ్బంది చేస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. వివరాలు యాప్‌లో ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాపై మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని గంటలకు నీళ్లు వస్తున్నాయి. ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఈవో రమేష్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి, ఎంపీడీవో శశికళ ఉన్నారు.

జిల్లాలో మిషన్‌భగీరథ పరిస్థితి ఇలా...

జిల్లా వ్యాప్తంగా 12 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలు కలుపుకొని మిషన్‌భగీరథ ద్వారా నల్లా కనెక్షన్లు అందించి నీటి సరఫరా చేస్తున్నారు. జిల్లాలో మిషన్ భగీరథ రూ. 143.83 కోట్ల వ్యయంతో పథకాన్ని చేపట్టారు. అగ్రహారం వద్ద 120 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో 625 ట్యాంక్‌లు ఏర్పాటు చేయగా వారిలో పాత ట్యాంక్‌లు 359, కొత్త ట్యాంక్‌లు 227 నిర్మించారు. విలీన అవాసాల్లో పాత ట్యాంక్‌లు 19, కొత్త ట్యాంక్‌లు 20 నిర్మించారు. మిషన్‌భగీరథ ఇంట్రా పైప్‌లైన్ 1,263.77 కిలో మీటర్లు నిర్మించారు. వీటితో పాటు ప్రభుత్వ సంస్థలు, ఇతరులకు సంబంధించి 443 పాఠశాలలు, 480 అంగన్‌వాడీ కేంద్రాలు, 38 ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాలు, రైతు వేదికలు, వైకుంఠ ధామాలకు కనెక్షన్లు అందించారు.

గ్రామాల వారీగా చూస్తే 255 గ్రామపంచాయతీల్లో 1.13 లక్షల ఇళ్లకు నీటి సరఫరా చేస్తున్నారు. బోయినపల్లి మండలంలో 23 గ్రామాలు, 9,811 ఇళ్లు, చందుర్తిలో 19 గ్రామాలు, 8,666 ఇళ్లు, ఇల్లంతకుంటలో 33 గ్రామాలు, 13,555 ఇళ్లు, గంభీరావుపేటలో 21 గ్రామాలు, 13,521 ఇళ్లు, కోనరావుపేటలో 28 గ్రామాలు, 11,521 ఇళ్లు, ముస్తాబాద్ 22 గ్రామాలు, 13,181 ఇళ్లు, రుద్రంగిలో 10 గ్రామాలు 4,040 ఇళ్లు, తంగళ్లపల్లిలో 30 గ్రామాలు 12,037 ఇళ్లు, వీర్నపల్లిలో 17 గ్రామాలు, 3445 ఇళ్లు, వేములవాడలో 11 గ్రామాలు, 4,984 ఇళ్లు, వేములవాడ రూరల్‌లో 17 గ్రామాలు 5,758 ఇళ్లు, ఎల్లారెడ్డిపేటలో 24 గ్రామాలు 13,247 ఇళ్లు, వీటితో పాటు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లోని ఇళ్లకు నీటి సరఫరా చేస్తున్నారు.

డీఎల్‌పీవో విచారణ

ముస్తాబాద్, జూన్ 13: మండల కేంద్రంలో ఇన్‌చార్జి డీఎల్‌పీవో బంగారు నరేశ్ విచారణ చేపట్టారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజు అక్రమాలపై జిల్లా పంచాయతీ అధికారికి స్థానిక అడ్వకేట్ సారుగు రాకేశ్ చేసిన ఫిర్యాదుతో పాటు గతంలో నకిలీ బిల్ బుక్కులు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్న విషయంలో జిల్లా ఇన్‌చార్జి డీఎల్‌పీవో బంగారు నరేశ్ గురువారం రాత్రి విచారణ చేశారు. మ్యుటేషన్‌లో డబ్బులు తీసుకోవడం, అక్రమనిర్మాణాలు, వంటి పలు అంశాల్లో వచ్చిన ఫిర్యాదు మేరకు రాత్రి వరకు ఇన్‌చార్జి డీఎల్‌పీవో విచారణ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరగలేదని తిరిగి శుక్రవారం రానున్నట్లు తెలిపారు. కాగా రాత్రిపూట విచారణకు రావడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి నర్సింలు, అరుట్ల మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే ఈవోతో పాటు, సిబ్బంది సెలవుపై వెళ్లడంతో ప్రత్యామ్నాయంగా అధికారులను ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు ఎవరికి విన్నవించేదని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు.

నేడు జడ్పీ సమావేశం

సిరిసిల్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జరుగుతుందని జడ్పీ సీఈవో ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని సభ్యులు, అధికారులు, సకాలంలో హాజరుకావాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి, జూన్ 13: తంగళ్లపల్లి మండలం మండపల్లి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఖాళీల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగులో ఒక పోస్టు ఖాళీగా ఉందని, ఎంఏ తెలుగు బీఈడీ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. అలాగే పీజీటీ ఇంగ్లీష్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉందని, ఎంఏ ఇంగ్లీష్ బీఈడీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీన మోడల్ స్కూల్లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే డెమోకు హాజరుకావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో పాటు ఒక జిరాక్స్ సెట్‌తో డెమోకు హాజరుకావాలన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- హాజరైన వేలాదిమంది నిరుద్యోగులు - 60కి పైగా కంపెనీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు - 1,764 మందికి లభించిన ఉద్యోగాలు
- యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 13: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాకు వేలాదిమంది నిరుద్యోగులు హాజరుకాగా 60కి పైగా వివిధ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 1,000 మందికిపైగా యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించాయి. సిరిసిల్ల పట్టణంలోని ఓ కల్యాణమండపంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ సహకారంతో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు. యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేయాలనుకునే యువత కోసం ఉద్యోగ అవకాశాలు కడుతాయన్నారు. వారంరోజుల పాటు పోలీసు అధికారులు, సిబ్బంది నిరుద్యోగులకు అవగాహన సమావేశాలు నిర్వహించి విజయవంతం చేశారన్నారు. శాంతి భద్రతలు కాకుండా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే 30వేల ఉద్యోగ నియామకాలు చేపట్టారని ఆయన అన్నారు. ఇటీవల గ్రూప్-1 పరీక్ష నిర్వహించామని, త్వరలో మెగా డీఎస్సీ చేపట్టనున్నామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా యువతకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్‌లు ప్రదానం చేసి దేశ, విదేశాల్లో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు దుబాయ్ ప్రతినిధులను పిలిపించి అక్కడి కంపెనీలకు ఉపయోగపడేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామన్నారు.

కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ యువత తమకు అందిన అవకాశాలను అనుకూలంగా మార్చుకొని ఉద్యోగాల్లో రాణించాలన్నారు. కష్టపడి పనిచేయడం అనేది ఒక అలవాటుగా మార్చుకోవాలని, ఏ ప్రాంతంలో అయినా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడిపించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం కూడా మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుందని, అలాగే యువత ఖాళీగా ఉండకుండా తన విద్యార్హతకు తగిన ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా వచ్చిన ఉద్యోగంలో ప్రతిభ కనబర్చడం ద్వారా యువత అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభం అవుతుందన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన కంపెనీలు విద్యార్హతను బట్టి తమ సంస్థల్లో పనిచేసేందుకు ఎంపికైన 1,764 మందికి ఎస్పీ అఖిల్‌మహాజన్ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్‌ఐలు యాదగిరి, రమేశ్, స్పెషల్ బ్రాంచి సీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐలు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ ప్రతినిధులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాల జాతర


బోనాల జాతరలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జూన్ 13: రుద్రంగి మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇంటికో బోనం చొప్పున డప్పుచప్పుళ్ల, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా పెద్దమ్మగుడికి తరలివెళ్లారు. పెద్దమ్మతల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్..

రుద్రంగి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతరకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై బోనాల ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట జడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి ఆభిలాష్, పల్లి గంగాధర్, స్వర్గం పరంధామ్, పడాల శ్రీనివాస్, పోగుల మహేష్, ఆర్మూర్ నర్సయ్య, మోతె నర్సయ్య, గండి అశోక్, డీజే హరీష్, పిట్టల జీవన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన విద్యాసాగర్‌రావు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యాసాగర్‌రావు

వేములవాడ టౌన్, జూన్ 13: మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు గురువారం డిల్లీలో కేంద్రమంత్రులను కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా కేంద్రమంతి వర్గంలో చోటు సంపాదించుకున్న జి కిషన్‌రెడ్డిని, హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వారికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనుల పరిశీలన


ధర్మారంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

కోనరావుపేట, జూన్ 13: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన మరమ్మతు పనులను కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. కోనరావుపేట మండలం కొలనూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన మరమ్మతు పనులను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎంత?, బడి బాటలో కొత్తగా ఎన్ని ప్రవేశాలు జరిగాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోనరావుపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన నల్లాలు, ఇతర పనులను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అక్కడి నుంచి ధర్మారం రాంనగర్‌లోని పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. వారి వెంట జడ్పీ సీఈవో ఉమారాణి, డీఈవో రమేష్ కుమార్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ - రుద్రంగిలో డ్రైనేజీ పనుల పరిశీలన


రుద్రంగిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్


ప్రభుత్వ విప్‌కు వినతి పత్రం అందజేస్తున్న రుద్రవరం గ్రామస్థులు

రుద్రంగి, జూన్ 13 రుద్రంగిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేమలవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధికారులను ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపుల నిర్మాణంలో ఉన్న డ్రైనేజి పనులను గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. డ్రైనేజీ కోసం తవ్విన సమయంలో ఇందిరాచౌక్ చౌరస్తాలో తాగునీటి పైపులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

దీంతో మిషన్ భగీరథ ఆధికారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడుతూ వెంటనే పైపులైన్ మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా డ్రైనేజి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ ఆధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి ఆభిలాష్, పల్లి గంగాధర్, స్వర్గం పరాంధామ్, పడాల శ్రీనివాస్, పోగుల మహేష్, ఆర్మూర్ నర్సయ్య, మోతె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేయండి..

వేములవాడ టౌన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేసి దాని నిర్మాణానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సర్వే నంబర్ 382, 383 భూమి కేటాయించాలని, సబ్ స్టేషన్ మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వ విప్‌ను కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఆది శ్రీనివాస్ వెంటనే సంబంధిత మంత్రిని, ఈఈతో ఫోన్‌లో మాట్లాడి త్వరలోనే సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, మాజీ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, నాయకులు కత్తి కనుకయ్య గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్ల జీవితాలతో ఆడుకోవద్దు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ - కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్ల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 13: ఆశావర్కర్లకు నష్టం కలిగించే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని గ్రామాలనుంచి తరలివచ్చిన ఆశావర్కర్లతో గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు ధర్నా చేస్తున్న ఆశావర్కర్లకు వచ్చి జిల్లాలో స్థానికంగా తనపరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మిగితా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం జరిగిన సమావేశంలో కోడం రమణ మాట్లాడుతూ ఆశావర్కర్లపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐనా తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఎంతో ఆశతో ఎదురుచుస్తున్న ఆశావర్కర్లకు ప్రస్తుత ప్రభుత్వం కొత్త సమస్యలు తెచ్చి పెడుతుందన్నారు. కరోనా సమయంలో ఆశావర్కర్లు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పని చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశావర్కర్లకు నష్టం కల్గించే విధానాలను మానుకోవాలని పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకొని ఆశావర్కర్లకు పారితోషకాలు కాకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు 18 వేల రూపాయలను ఫిక్స్‌డ్ వేతనాన్ని నిర్ణయించి అందించాలన్నారు. పెండింగ్ బకాయిలను అందించాలని పారితోషకాలు లేని పనులను ఆశాలతో చేయించవద్దన్నారు. వివిధ రకాల సర్వేలు, డ్యూటీలకు సంబంధించి ఆశాలకు రావాల్సిన టీఏడీఏలను అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో డ్యూటీలు చేసి ఆశావర్కర్లకు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదని చాలా జిల్లాల్లో ఎన్నికల డ్యూటికి సంబంధించిన ఆశావర్కర్లకు డబ్బులు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి స్థానికంగా పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్, అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జయశీల, గౌరవ అధ్యక్షురాలు భారతి, కస్తూరి, చంద్రకళ, గాయత్రి, రాణి, లత, శాంత, రుక్మిణి, వరలక్ష్మి, లావణ్య, మమత, లక్ష్మి, సుజాత, స్వప్న, భూలక్ష్మి, తార, జమున తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 13: తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ నిర్వహించిన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. కరీంనగర్‌లో పదోతరగతి పరీక్షకు 446 మంది విద్యార్థులు హాజరుకాగా 188 మంది ఉత్తీర్ణత సాధించారు. 42.15శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 297 మంది పరీక్షలు రాయగా 265 మంది 89.23శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 383 మంది పరీక్షలకు హాజరుకాగా 130 మంది 33.94శాతం ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో అత్యధికంగా 606 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అత్యల్పంగా 109 మంది కేవలం 17.99శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

● ఇంటర్మీడియట్‌లో జగిత్యాల జిల్లాలో 503 మంది పరీక్షలు రాయగా 188 మంది, 37.38శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 719 మంది పరీక్షలు రాయగా 331 మంది 46.04శాతం, కరీంనగర్‌లో 822 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా వారిలో 480 మంది 58.39శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 553 మంది పరీక్షలు రాయగా 402 మంది, 72.69శాతం ఉత్తీర్ణుల య్యారు. ఈమేరకు 2023-24 లో నిర్వహించిన పరీక్షలకు హాజరైన వారిలో ఉత్తీర్ణులైన వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో విడుదల చేశారు.

కొనసాగుతున్న విద్యా సంస్థల వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 13: విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా విద్యా సంస్థల వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన తనిఖీలలో మొత్తం 24 వాహణాలను సీజ్ చేసినట్లు డీటీపీ పురుషోత్తం తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని విద్యా సంస్థల బస్సులు 2, ఫిట్‌నెస్, టాక్స్ లేకుండా నడుపుతున్న విద్యా సంస్థల బస్సులు 3, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న విద్యా సంస్థల బస్సులు 4, పన్నులు చెల్లించని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 6, ఫిట్‌నె స్ లేని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 1, ట్రాక్టర్ ట్రాలీకి ట్యాక్స్ చెల్లించకుండా నడుపుతున్న ఒక వాహనాన్ని పట్టుకున్నాట్లు , పట్టుకున్న వాహనాలను సీజ్ చేసి జిల్లా రవాణా కార్యాల యానికి తరలించినట్లు డీటీసీ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రమ మాదాలు చోటు చేసుకోకుండా అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎంవీఐ టి రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, జూన్ 13: ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు చూపకుండా మోసాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేష్ అనే వ్యక్తి 20 సంవత్సరాల క్రితం తిప్పాపూర్ శివారులోని సర్వే నంబర్ 138, 139, 141, 142లో గల 200 గజాల భూమిని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన లెంకల రాజుకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు సరిగా చూపెట్టకుండా ఇబ్బందులకు గురిచేశాడు. అంతే కాకుండా మరల అదే భూమిని సందవేణి ఎల్లవ్వకు గిఫ్ట్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేయించి ఆమెను బెదిరించి సదరు మహిళ వద్ద లక్ష రూపాయలు తీసుకున్నాడు. సరైన హద్దులు చూపించకుండా మోసం చేయగా సందవేణి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

చేదబావిలో పడిన వృద్ధురాలు

- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



భాగ్యమ్మను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి, జూన్ 13: చొప్పదండి పట్టణంలోని జ్యోతినగర్‌లో గురువారం చేదబావిలో వృద్ధురాలు పడిపోగా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పెంబాల భాగ్యమ్మ (60) గురువారం ఉద యం ఇంటి సమీ పంలో ఉన్న చేదబా విలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది తాళ్లసా యంతో బావిలోకి దిగి వృద్ధురా లిని పైకి తీసుకువచ్చారు. భాగ్యమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. కార్యక్ర మంలో అగ్నిమాపక సిబ్బంది జి రవీందర్, కె శ్రావణ్‌కుమార్, కె సతీష్, వి గంగేశ్ పాల్గొన్నారు.

నర్సింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, జూన్ 13 : మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపును గురువారం అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామివారి హుండీలో 4లక్షల 66వేల 35 రూపాయల నగదు భక్తుల నుండి సమకూరినట్లు ఆలయ ఈవో వెంకన్న తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ సత్యనారాయణరావు, దేవాదాయ పరిశీలకులు సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకుమారాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, కార్యాలయ సిబ్బంది, మహేందర్, కొమురయ్య, రమేష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య బలోపేతానికి 'పీసెట్' దోహదం

- శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మల్లేష్



మాట్లాడుతున్న శాతవాహన మాజీ వీసీ మల్లేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్13: వ్యాయామ విద్య బలోపేతానికి పీసెట్ నిర్వహణ ఎంతగానో దోహదపడుతుందని శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మల్లేష్ అన్నారు. తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ శారీరక పరీక్షలు గురువారం శాతవాహన యూనివర్సిటీ మైదానంలో ముగిశాయి. మహిళ అభ్యర్థులకు నిర్వహించిన శారీరక సామర్థ్య పరీక్షలను ఆయన జెండా ఊపి మాట్లాడారు. రెండు పర్యాయాలు పీసెట్ నిర్వహణ బాధ్యతలను శాతవాహన యూనివర్సిటీ నిర్వహించ డంతో న్యాక్ గ్రేడ్‌కు అర్హత సాధించే అవకాశం ఉందన్నారు. పాలమూరు విశ్వవిద్యా లయం మాజీ ఉపకులపతి ఆచార్య లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లపైనే ఉంటుంద న్నారు. చివరి రోజు మొత్తం 345మంది మహిళ అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 253మంది బీపీఈడీ అభ్యర్థులు కాగా 102మంది డీపీఈడీ అభ్యర్థులు. వీరికి 100మీటర్లు, 400మీటర్లు షాట్‌పుట్ ,హైజంప్, లాంగ్‌జంప్‌లతో పాటు 8క్రీడా అంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, టీజీ పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగం డైరెక్టర్ ఆచార్య జెప్రభాకర్ రావు, శాతవాహన విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునవర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్‌లు విజయ్‌కుమార్, బాలరాజు, శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, గద్దె సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బోర్డు పైన పడి పారిశుధ్య కార్మికుడి మృతి

ధర్మారం, జూన్ 13: ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎల్తూరి సత్తయ్య(50) అనే పారిశుద్య కార్మికుడు గురువారం చదును చేస్తున్న క్రమంలో పైన గల బోర్డు ప్రమాదవశాత్తు పడడంతో మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల వాటర్ ట్యాంక్ కింది భాగం ఆవరణలో గల చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ కార్మికుడు సత్తయ్య తొలగిస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్ యొక్క వాటర్ లెవల్ చూపే బోర్డు పై నుంచి సత్తయ్యపై పడింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ భుజం వెనుక తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తయ్య భార్య శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మికులు కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన దళిత యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, జూన్ 13: వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో గురువారం తెల్లవారు జామున నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగిరి గ్రామానికి చెందిన జవ్వాజి ఎల్లయ్య (55) అనే వ్యక్తి గురువారం తెల్లవారు జామున సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటు వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

- 34 మందిపై కేసు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కరీంనగర్ క్రైం, జూన్ 13: అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న సమాచారం మేరకు గురువారం కరీంనగర్ రూరల్ పోలీస్ సబ్ డివిజన్ పోలీసులు దాడులు నిర్వహించి 34 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. కరీంనగర్ శివారులోని అలుగునూర్, తిమ్మాపూర్ మండలం రేణికుంటల వద్ద పోలీసులు నిర్వహిచి ప్రత్యేక తనిఖీలలో ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని మానకొండూర్, ఎల్ఎండీ పోలీసు ఠాణాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేశామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు గోనెల సంపత్, బొంగోని రాజు, ఇరుగదిండ్ల సమ్మరాజు, సారయ్య, బోయిని అనిల్‌రాజు, పల్లపు ఎల్లయ్య, మార్క అభిషేక్, జితెందర్, వెంకటస్వామి, రాజేశ్వరి, అజయ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రమేశ్, సంపత్, ప్రణయ్‌వంశీ, అనిల్, అంజయ్య, రాజు, వెంకటేష్, రాజశేఖర్, హరితేజ, ఎల్లయ్య, గణేష్, అనిల్, కుమార్, రమేష్, రవి, ఎండీ అజీమ్, రమేశ్, రాజశేఖర్, జంపయ్యలపై ఐపీసీ సెక్షన్ 379, 21(4) మైన్స్ అండ్ మినరల్స్ యాక్టుతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట గ్రామ సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను గురువారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు



మాట్లాడుతున్న టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం, జూన్ 13: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. నగరంలో గురువారం వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకొని 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. పట్టుబడిన వాహనాలను ట్రాఫిక్ ఠాణాకు తరలించామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే సంబంధిత వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని కరీంనగర్ టౌన్ ఏసీపీ హెచ్చరించారు. కరీంనగర్‌లో బుధవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు గురువారం టౌన్ ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు వాహన యజమానులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ఖరీముల్లా ఖాన్, స్వామి, ఎస్ఐలు ఇషాక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పుల మృతి



దుప్పులకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, జూన్ 13: వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పులు మృతి చెందాయి. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో ఉండే అటవీ ప్రాంతం నుంచి తాగునీటి దాహార్తి తీర్చుకొనేందుకు రెండు చుక్కల దుప్పులు వచ్చాయి. దుప్పుల రాకను గుర్తించిన కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గాయపడిన దుప్పులను గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించటంతో వాటిని స్వాధీనం చేసుకొని వైద్యం కోసం అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. పశు వైద్యాధికారులు చికిత్స అందించినప్పటికీ కోలుకోలేక రెండు దుప్పులు మృతి చెందాయి. దాంతో అటవీ సెక్షన్ అధికారికి పద్మలత ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించి అటవీ ప్రాంతంలో కాల్చివేశారు

విద్యుదాఘాతంతో గేదె మృతి

ధర్మపురి, జూన్ 13: దమ్మన్నపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గురువారం ఉదయం రైతు మడిపల్లి తిరుపతి తన గేదెను మేపడం కోసం సమీపంలో గల గోదావరి నది వద్దకు తీసుక వెళ్లాడు. గేదె గడ్డి మేస్తుండగా పొలం కోసం అమర్చిన విద్యుత్ మోటార్ వైరు తాకి షాక్ తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ 70,000 విలువ ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు తిరుపతి కోరారు.

గుండెపోటుతో కూలీ మృతి

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని పొత్తూర్ గ్రామసమీపంలోని మానేరువాగులో కూలీపనికి వెళ్ళిన చెక్కిళ్ళ శ్రీనివాస్ (50) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

వీర్నపల్లి, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి పదిర గ్రామానికి చెందిన వేముల రాజు(40) బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి కోనరావుపేట గ్రామశివారులో ద్విచక్ర వాహనంతో చెట్టును బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్సులో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

మానకొండూర్, జూన్ 13: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన బండి అశోక్‌కు చెందిన ఆవు గురువారం పిడుగుపాటుతో మృతి చెందింది. గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

96 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఐతరాజ్‌పల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

సుల్తానాబాద్, జూన్ 13: జిల్లాలో గురువారం పౌర సరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన తనిఖీలలో 96 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం నిల్వలు పటుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లి రేషన్ దుకాణాలను, ఐతరాజుపల్లి ఓపెన్ ఏరియా పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలోని రేషన్ షాపు తనిఖీచేసినప్పుడు 52.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎక్కువగా రేషన్ షాప్ నిల్వలలో గుర్తించామని అన్నారు. అదేవిధంగా సుల్తానాబాద్ మండలం ఐతారాజుపల్లి వద్ద ఓపెన్ ఏరియాలో 43.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని డీసీఎస్‌వో హెచ్చరించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత

- మరమ్మతులు చేయని అధికారులు
- రాకపోకలకు ప్రజల అవస్థలు



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

మల్లాపూర్, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు పైపు మరమ్మతుల కోసం పది రోజుల క్రితం గుంత తవ్వారు. పనులు పూర్తి చేసుకున్నాక గుంతను మాత్రం అలానే ఉంచి వెళ్లారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వేలువెత్తున్నా యి. అదే గుంతలో గ్రామానికి చెందిన బింగి మనస్విత్ అను బాలుడు గురువారం ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో బాలుడి తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రతి నిత్యం ఆ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిల్లో ఆ రోడ్డుపై తెలియని వారు వేళితే ఏలాంటి ప్రమాదం జ రుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు స్పదించి గుంతను పుడ్చాల్సిన అవసరం ఉదని కాలనీ వాసులు వాపోతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి - విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంల పంపిణీ





సిరిసిల్లలో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, డీఈవో, వీర్నపల్లిలో ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో..

సిరిసిల్ల రూరల్, జూన్ 13: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు నడిపిస్తున్నాయని వీటిలోనే పిల్లలందరిని తల్లిదండ్రులు చేర్పించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌లతోపాటు యూనిఫాంలను సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళాచక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌లతో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ అరుణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి సెలవులు ముగించుకొని పైచదువుల కొనసాగింపులో భాగంగా పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలపడంతోపాటు నూతన ప్రవేశాల ద్వారా పాఠశాలకువచ్చిన విద్యార్థులకు స్వాగతం తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతీవిద్యార్థికి ఉచితంగ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్ని మౌలిక వసతులను కల్పించడంతోపాటు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలో తమ పిల్లలను చేర్పించకుండా ప్రభుత్వం పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతీలాల్, ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, పాతూరి మహేందర్‌రెడ్డి, నారాయణ, గోవిందరావు, దేవత ప్రభాకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, ఇప్పల్లపల్లె, సర్దాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలను 8వ వార్డు కౌన్సిలర్ చెన్నమనేనికీర్తి కమలాకర్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, 8వవార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, మాజీ సర్పంచ్‌లు బెజ్జారపు బాలరాజుగౌడ్, రాకం రమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి సల్లూరి సంతోష్‌గౌడ్, సల్లూరి భూమయ్యగౌడ్, పెద్దూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, వుత్తం విజయ్‌కుమార్, వాణిశ్రీ, కల్పన, గణేష్, ప్రమీల, మహేష్, తిప్పవరం సుధ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చైర్మన్లు బట్టు పద్మ, ఎంద్ర ప్రమోద, ప్రధానోపాధ్యాయులు పావని, రాజశేఖర్‌రెడ్డి, ఎర్రోజు బ్రహ్మచారిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నారని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వకుల, ఉపాధ్యాయులు రఘుపతి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జోసెఫ్, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసించే విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధతో విని పాఠశాలకు మంచి గుర్తింపును తీసుకురావాలని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ మండలం అనుపురం గ్రామంలో గురువారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు ఉన్నారు.

తెలుగు పుస్తకాలు వాపస్...

- ముందుమాటలో మాజీ సీఎం, గత మంత్రులు, అధికారుల పేర్లు

సిరిసిల్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్యార్థులకు అందించిన పాఠ్యపుస్తకాల్లో తెలుగు వాచకాల్లో ముందు మాటలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, గత మంత్రులు, ఉన్నాతాధికారుల పేర్లే ఉన్నాయి. వాటిని విద్యార్థులకు తొలి రోజు పంపిణీ చేయడంతో గందరగోళం ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో విద్యాశాఖ దీనిపై దృష్టి పెట్టినట్లు తెలిసింది. గురువారం తెలుగు పుస్తకాల పంపిణీ చేయలేదు. తొలిరోజు పంపిణీ చేసిన తెలుగు వాచకాలను తిరిగి విద్యాశాఖ మౌఖిక ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి ఉపాధ్యాయులు తిరిగి తీసుకున్నారు.



అనుపురంలో పుస్తకాలను అందిస్తున్న జడ్పీటీసీ రవి

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు - భారీగా తరలివచ్చిన భక్తులు




సాయిబాబాను దర్శించుకుంటున్న కొండూరు గాంధీ, తదితరులు.. ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట, జూన్ 13: గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో శ్రీ సాయిబాబా ఆలయ 20 వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవంలో బాగంగా గణపతి పూజ, పుణ్యా వచనం, రక్షబంధనం, అఖండ దీపారాదన, అగ్ని ప్రతిష్ట, ఆవాహిక దేవతా హోమం, పూర్ణహుతి, మంగ్లళహారతులు, 32 రకాల కళశాలతో కళశాబిషేకం, పంచామృతాభిషేకం, ఆశీర్వాదం, ఆశీర్వాచనం భక్తకోటికి తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమానలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొండూరు గాంధీ చేతుల మీదుగా పులిహోర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కొలుముల అంజమ్మబాల్‌రెడ్డి, ఎంపీటీసీ నాగభూషనం, సింగిల్‌విండో డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూమరాజం, నాయకులు బండారి బాల్‌రెడ్డి, రమేష్, అంజిరెడ్డి, పద్మారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య, తిరుపతి, నాగరాజు, నర్సాగౌడ్, సత్యనారాయణ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీకి మండల అధ్యక్షుడి రాజీనామా

ఇల్లంతకుంట, జూన్ 13: బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పూర్తిసమయం పార్టీకి కేటాయించడం వీలు కానందున రాజీనామా చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడికి రాజీనామా పత్రం పంపించారు. బీజేపీ మండల అధ్యక్షుడి రాజీనామాను ఆమోదిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీఈడీ చేసిన వారికి అవకాశం ఇవ్వాలి

జగిత్యాల టౌన్, జూన్ 13: రాష్ట్రంలో పీఎస్ హెచ్ఎంల పదోన్నతుల్లో బీ ఈడీ చేసిన వారిని కూడా పరిగణలోకి తీసుకుని పదోన్నతుల విషయంలో అవకాశం కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్పందించి మాట్లాడారు. అందరికి సమన్యాయం జరిగే విధంగా 65 వేల ప్రాథమిక ఉపాధ్యాయుల విశాల ప్రయోజనాల దృష్ట్యా సాంకేతిక పొరపాటును సరిచేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు సమస్యను సీఎం దృష్టికి తీసుకవెళ తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు అమరనాథ్‌రెడ్డి, సురేష్, శంకర్, రమేష్, దేవయ్య, రాంరెడ్డి, ఆనంద రావు, రాజశేఖర్ ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ధర్మపురి, జూన్ 13: ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలలో హిందీ, గణితం ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ ఉపాధ్యాయ పోస్టుకు డిగ్రీతో పాటు హెచ్‌పీటీ, గణిత ఉపాధ్యాయ పోస్టుకు పీజీతో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు అందరు ఈ నెల 18 వ తేదీ లోపుగా మగ్గిడి ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19 న ఆదర్శ పాఠశాలలో డెమో ఉంటుందని ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు గౌరవ వేతనం రూ 18,200 ఉంటుందని ఆయన వివరించారు. మిగతా వివరాల కోసం మొబైల్ నంబర్ 9949015156 సంప్రదించాలని ఆయన కోరారు.

కార్పొరేట్ స్కూళ్ల యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



సిరిసిల్లలో స్కూల్‌ను సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

సిరిసిల్ల రూరల్, జూన్ 13: అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలను విక్రయిస్తున్నా కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాలలను సీజ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థ పాఠ్యపుస్తకాలతో పాటు నోటుబుక్కులు అమ్ముతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలకు తొత్తులుగా మారారంటూ గురువారం పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు విద్యా శాఖ అధికారులు స్కూల్‌ను పరిశీలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ పాఠశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అనుమతులు రద్దు చేయాలని ఆందోళన చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లామన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి సీజ్ చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా అధిక ఫీజులతో పాటు పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నా విద్యాశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లోపెల్లి రాజు, అన్నల్‌దాస్ పవన్‌కుమార్, ఎనగందుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మానేరు వాగులో ఆగని ఇసుక దందా

- నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 13: ఎల్లారెడ్డిపేట మండలంలో నారాయణపూర్, బండలింగంపల్లి, సింగారం, రాగట్లపల్లి, పదిర, వెంకటాపూర్, అగ్రహారం గ్రామ శివారులోని మానేరు వాగు పొడువునా ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అప్పుడప్పుడు దాడులు నిర్వహించి హడావిడి చేసే అధికారులు.. ఆ తర్వాత మిన్నకుంటున్న తీరుపై పలు ఆరోపణలున్నాయి. అనుమతుల పేరిట అక్రమ రవాణా వేకువజాము నుంచి రాత్రి వరకు సాగుతోంది. అధికారికంగా తరలించేది కొంత అయితే.. అనధికారికంగానే ఎక్కువ రవాణా అవుతోంది. వాగులోని వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి లేకపోయిన అక్రమార్కులు చెట్ల కొమ్మలను కొట్టి వేసి పారుతున్న నీటిలో నుంచి ట్రాక్టర్ల ద్వారా ప్రమాదపు అంచునా తరలిస్తున్నారు. అడ్డు అదుపు లేకుండా మైనర్లతో వాహనాలను అతివేగంగా తోలుతున్నారు. ఇసుక ట్రాక్టర్లు ఎదురుగా వస్తున్నాయంటేనే వాహనాదారులు, ప్రయాణికులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

● **అనుమతుల పేరుతో..**

మండలంలోని నారాయణపూర్, అగ్రహారం, వెంకటాపూర్, రాగట్లపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి తహసిల్ అధికారులు స్థానిక అవసరాల నిమిత్తం ఇసుక రవాణాకు అనుమతులు ఇస్తున్నారు. లబ్ధిదారులు తమ భవన నిర్మాణాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక్కో ట్రాక్టర్‌లో నింపే మూడు క్యుబిక్ మీటర్ల ఇసుకకు రూ.300 డీడీ తీసి తహసీల్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటోంది. కానీ లబ్ధిదారులకు బదులు ట్రాక్టర్ల రవాణాదారులే నిర్మాణ అనుమతి పత్రాలను తీసుకుని సంబంధిత శాఖ అధికారుల అనుమతులు పొందుతున్నారు. అనుమతి ఒక్క ట్రాక్టరుకు మాత్రమే పొంది అదే అనుమతి పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా వ్యాపారులు మానేరు వాగులోకి చేరుకుని తోడేస్తున్నారు. వేకువజాము నుంచి రాత్రి వరకు సాగిస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన ఓ శాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని సమాచారం. ట్రిప్పుకు రూ.200 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇసుక రవాణాలో అధికంగా మైనర్లే డ్రైవర్లుగా కొనసాగుతున్నారు. వాహనం ముందు బైక్‌పై యజమాని వెళుతూ అధికారుల కంట పడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎవరైనా అధికారులు ఎదురు పడితే ముందస్తుగా వాహన డ్రైవర్‌కు సమాచారం ఇచ్చి వాహనాన్ని దారి మళ్లీస్తున్నారు. ఇసుకను తవ్వడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఇసుక వాహనాల వల్ల వాగు సమీపంలో ఉన్న తమ వ్యవసాయ మోటర్ పైపులు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఆయా గ్రామాల మానేరు వాగు పరివాహక ప్రాంత రైతులు కోరుతున్నారు.



ఇసుక తవ్వడంతో ఏర్పడిన గుంత

అనుమతులు అతిక్రమిస్తే చర్యలు



- రామచంద్రం, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట

మండలంలో స్థానిక అవసరాల కోసం గుర్తించి ఇసుక రీచ్‌ల వద్ద నుంచి అనుమతి పొంది ఇసుకను తరలించాలి. కూపన్లు లేకుండా ఇసుకను రవాణా చేయవద్దు. అనుమతులు తీసుకున్న వారు కూడా నిబంధనల ప్రకారమే తరలించాలి. అధిక ట్రిప్పులు రవాణా చేస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు రవాణాదారులపై కేసు నమోదు చేస్తాం. అక్రమ తరలింపుపై మా దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటాం.

మైనర్లు ట్రాక్టర్లు నడిపితే చర్యలు



- రమాకాంత్, ఎస్ఐ, ఎల్లారెడ్డిపేట

మండలంలో కొనసాగుతున్న ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటున్నాం. అనుమతి సమయంలో తహసీల్ అధికారులు వాహన డ్రైవర్ల లైసెన్స్ వివరాలను పొందుపరిచేలా చూస్తున్నారు. మైనర్లు ఇసుక ట్రాక్టర్లు నడిపితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

ప్రజల ఆశీర్వాదంతోనే 'బండి'కి కేంద్ర మంత్రి పదవి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

సిరిసిల్ల రూరల్, జూన్ 13: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల ఆశీర్వాదంతోనే బండి సంజయ్‌కుమార్‌కు కేంద్ర మంత్రి పదవి దక్కిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు నవభారత్ రైస్‌మిల్లులో గురువారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కృతజ్ఞత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ఓట్లేసిన ప్రజలు దేవుళ్లతో సమానమని అన్నారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు రెండోసారి ఎంపీగా గెలుపొందిన బండి సంజయ్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియామకం చేయడం హర్షణీయమని అన్నారు. రానున్న రోజుల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని ఆశిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ అడెపు రవీందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గరిపెల్లి ప్రభాకర్, ఎంపీపీ బండ మల్లేశం, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామపంచాయితీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

సిరిసిల్ల టౌన్, జూన్ 13: గ్రామపంచాయితీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి గ్రామపంచాయితీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమాన వేతనం చట్టంను అమలు చేయాలి, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. సీనియారిటీ, విద్యా అర్హతలను బట్టి కార్మికులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్మికులకు ప్రతినెల తప్పనిసరిగా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు మీసం లక్ష్మన్ పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 13: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రవిగౌడ్ మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రాంభమైనా ప్రభుత్వం విద్య వ్యవస్థను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా విద్యాశాఖకు సంబంధించిన మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యల మీద దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో అనుమతులు లేకండా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు అమ్మవద్దని చెప్పినా అమ్మకాలను ప్రారంభించారని అధికారులు స్పందించాలని అన్నారు. బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, ఒగ్గు అరవింద్, రుద్రువేణి సుదీప్, కోడం వెంకటేష్, రాపెల్లి భాను, ఎస్‌డీ ఆసిమ్, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చందుర్తి, జూన్ 13: గ్రామాల్లో కుటుంబ సర్వే పూర్తి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లతో గురువారం సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ పరిధిలో గల కుటుంబలను 100 శాతం సర్వే పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల ఎత్తు కొలతలు, బరువులను తీసి తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. కేంద్రాలకు సంబంధించిన ప్రతీ రిపోర్టులో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాజకుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వ విప్ చేయూత



బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, జూన్ 13: కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్కుర్తి ఎల్లయ్య దుబాయిలో మృతి చెందగా ఆయన కుటుంబానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేయూతనందించారు. ప్రస్తుత సహాయం కింద 50 కిలోల బియ్యాన్ని సమకూర్చగా కాంగ్రెస్ మండల నాయకులు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మండల నాయకులు శ్రీనివాస్, రాజేష్, రవి, అజీమ్ పాషా, సదానందం, నాగన్న, భూమేష్, మానుక సత్యం, ప్రభాకర్, రాములు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బేకరీ సీజ్

చందుర్తి, జూన్ 13: చందుర్తి మండల కేంద్రంలోని బేకరీని సీజ్ చేసినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. గడువు తీరిన కూల్ డ్రింక్స్‌ను గుర్తించి బేకరీ సీజ్ చేసినట్లు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ దాడులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మండల కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో కిరాణా దుకాణం యజమానులతో పాటు, హోటళ్లు బందు చేశారు.